## ‘స్ట్రా’ తనద్వారా చల్లని పానీయాన్ని అందిస్తుంది. అయినా దాన్నెవరు గుర్తిస్తారు?

“నిన్న సాయంత్రమే చెప్పాను. ఈయేళకి తేలిపోవాలని. ఏదే ఆడూ మూతి సాటేశాడు” రంకెలేస్తున్నాడు పేర్రాజు.

పాకముందు నిలబడి శివాలమ్మ. పావు గంట నుంచి వింటోంది. కట్టుకున్నోడు వచ్చినా, ఈ పేర్రాజు నోరు కటలేడని ఆమెకు తెలుసు. అందుకె తల దించుకొని వింటోంది.

“అప్పు తీసుకునేటప్పుడు తీర్చాలని ఎరగడా? నేకుంటే ధర్మరాజుగారి సొమ్ము ఎగేసి బతకగలననుకుంటున్నాడా?”

పేటలో జనం చేతులు పిసుక్కుంటు న్నారు. మూతులు కుట్టేసుకుని దీనంగా శివాలమ్మకేసి చూస్తున్నారు.

మూతులు ఎందుకు కుట్టేసుకోవాలో తెలియని కుర్రాడొకడు ముందుకొచ్చి “ఏంటయ్యా! మొగాడింట్లో లేడని చెప్తుంటే ఇనకుండా ఏంటా కేకలు” అన్నాడు.

అడిగిన కుర్రాడికేసి జనం బిక్కచచ్చి పోయి చూశారు. పేర్రాజు నెమ్మదిగా వెనక్కి తిరిగి “నువ్వెవడవు బాబూ” అతి నెమ్మదిగా అడిగేడు.

“నే నెవరైతే నీకెందుకూ ?”

“అలాగ” అంటూ పేర్రాజు చేయి గిర్రున తిప్పేడు. అడిగిన కుర్రాడు



అమడ దూరంలో వున్న పెంటకుప్ప మీద పడ్డాడు.

జనం ఎవరూ వాళ్ళ స్థానాల్లోంచి కదల్లేదు.

"ఇంక బుద్ధిగా ఇంటికెళ్ళిపో" చేతులు దులుపుకుంటూ విలాసంగా అన్నాడు పేర్రాజు.

నాలుగు పదుల పేర్రాజు రెండు పదుల నుండి ఇలాంటి వాళ్ళనెందరినో చూశాడు.

పేర్రాజు ఆరు అడుగుల భారీ విగ్రహాన్ని చూసి ఆ కుర్రాడు భయపడినట్లు లేదు. లేచి వళ్ళు దులుపుకుని మళ్ళా కలబడబోయేడు.

ఇక జనం కలుగచేసికోకుండా ఉండలేకపోయేరు. నలుగురెళ్ళి ఆ కుర్రాడ్ని మూలకులాక్కెళ్ళి "వాడితోటి నీకెందుకు- వాడు వడ్డీ ధర్మరాజు మనిషి. పో...." బలవంతంగా పంపించేశారు.

"ఏంటయ్యా! అణ్ణి వదిలేత్తున్నారు" అరిచేడు పేర్రాజు.

పేర్రాజు విసుగ్గా శివాలమ్మకేసి చూసి "ఏంటే! చెప్పు. చెంబు - తప్పేలా - లాక్కోచున్నావా? నేక సొమ్మిస్తావా?" ఆఖరి కోరిక అడిగే జైలు వార్డెన్‌లా అడిగేడు.

"నాకాడ ఏటుంటది బాబు" శివాలమ్మ అసహాయత ధ్వనిస్తూ పలికింది.

"సరే కానియ్!.... ఒ రే యి .... కానీయండి" ఉరికి ఆజ్ఞాపించే జైలు వార్డెనులా ఆర్డర్ ఇచ్చేడు.

అందుకోసమే నిలబడిన ఇద్దరు గుడిసెలోకి దూరేరు. చెంబులు....తప్పేలాలు.... తాతలనాటి పేకెజి పెట్టెలు వీధిలో కొచ్చేశాయి.

శివాలమ్మ అరుస్తోంది. ఆక్రోశిస్తోంది. జనం కళ్ళు అప్పగించి చూస్తున్నారు.

వడ్డీ ధర్మరాజు గూర్చి పేర్రాజుగూర్చి తెలియని వాళ్ళు ... ఒకళ్ళిద్దరు పక్కవాళ్ళని అడుగుతున్నారు.

"అదంతే! మనం అప్పుసేయకా తప్పదు. తీర్చకుంటే ఇదీ తప్పదు." అంటున్నారు వేదాంత ధోరణిలో.

బండిమీదకు సామాను ఎక్కేసిన తర్వాత- శివాలమ్మ అభిమానం వదిలేసి పేర్రాజు కాళ్ళు పట్టుకుని.

"సూడు పేర్రాజూ! నా అన్న లాంటోడివి. ఓ పాలికి కనికరించు" ప్రాధేయపడింది. అర్థించింది.

పేర్రాజు విదిలించుకొని "నడవండి" అన్నాడు. బండి కదిలింది. పేర్రాజు అనుసరించేడు.

మొదలు నరికిన చెట్టులా కూలబడిపోయింది శివాలమ్మ.. అరుస్తోంది. ధర్మరాజుని అతని వంశాన్ని పేర్రాజుని.... అతని పుట్టుకను సంశయించే తిట్లతో ఆవేశం వ్యక్తం చేస్తోంది.

బండి కనుమరుగయిన తర్వాత జనం ఆమె చుట్టూ చేరారు. ఓదార్చే పనిలో పడ్డారు.

ఓ సంసారం కూలిపోయింది. కరెన్సీగా మారిపోయి ఇనప్పెట్టెలోకి చేరి - మిగిలిన కరెన్సీల కథలు అడుగుతోంది.

* * *

తెలవారేసరికి పేటంతా గుప్పుమంది. నమ్మలేనట్లు జనం ధర్మరాజింటి కేసి పరుగెత్తారు.


వలయంలా పోలీసులు ధర్మరాజింటి చుట్టూ నిలబడివున్నారు.

"నిజమే. నిజంగానే" అడిగే దాకదు పోలీసుని.

పోలీసు తలూపేడు.

ఎవరికి వారే అంతరాత్మలో సంఘర్షణకు లోనవుతున్నారు. రెండు కంఠాలు.

సత్సాహిత్యానికి ఉత్తమవేదిక
శ్రీమతి
యద్దనపూడి
సులోచనారాణి
ప్రేమసింహాసనం,
శ్రీ యండమూరి వీరేంద్రనాథ్
సైంటిఫిక్ సీరియల్ యుగాంతం.
వర్ధమాన రచయిత్రి శ్రీమతి లక్ష్మి
మీరా ధారావాహికంగా వస్తున్నాయి.
జ్యోతి నవలల పోటీలో ప్రథమ బహుమతి
పొందిన నవల శ్రీ కంఠంనేని రాధాకృష్ణమూర్తి
మానవుడు జ్యోతి ఏప్రిల్ సంచికలో
నవలానుబంధంలో
వెలువడింది
ప్రతినెలా అత్యధికంగా (8,12,000 పాఠకులు) చదవబడుతున్న ఏకైక తెలుగు మాసపత్రిక
జ్యోతి సచిత్ర మాసపత్రిక




"మా బాగా జరిగిందని" ఓ కంఠం.

"అయ్యో! పాపం" రెండో కంఠం.

కొంతమందిలో రెండో కంఠం పీలగా వుంటే– మరి కొంతమందిలో మొదట కంఠం పీలగా వుంది.

"అయ్యో! మావో! నాకొంపముంచేవు కదరో" అంటూ అరుస్తూ, పడుతూ, లేస్తూ విరబోసుకున్న జుట్టుతో పేర్రాజు పెళ్ళాం ముత్యాలు ధర్మరాజింటికేసి వస్తుంటేమాత్రం మొదటి కంఠం గాంభీర్యం కోల్పోవటం మొదలైంది.

ఇన్‌స్పెక్టర్ అతి జాగ్రత్తగా శవాన్ని పరీక్షచేసి "సందేహంలేదు. ఇది హత్య. తల వగులగొట్టి చంపేరెవరో! రాత్రి ఇతను మీ ఇంట్లో ఉన్నాడు" సూటిగా ధర్మరాజుని చూస్తూ అన్నాడు.

పేర్రాజు శాశ్వత నిద్ర పోతున్నాడు. అతని తలమీంచి కారిన రక్తం గడ్డ కట్టింది చుట్టూ.

ధర్మరాజుగారు నవ్వేరు. లోపలకు నడిచేరు. నవ్వులకు అర్థం తెలిసిన ఇన్‌స్పెక్టర్ ఆయనను అనుసరించేడు.

మరోగంటకు శవం రిక్షామీద ముత్యాలింటి కొచ్చేసింది. శవంతోపాటు ఓ వంద కాగితం ముత్యాలు చేతికొచ్చింది.

జనం దూరంగా నిలబడి చూస్తున్నారు. గుండెలవిసేలా ఏడుస్తోంది ముత్యాలు.

ఏడ్చి.... ఏడ్చి ఆమెగొంతు జీర బోయింది.

ఒంట్లోవున్న శక్తి కరిగేలా ఏడిచేసింది.

"ఒరే పెంటయ్యా – రాములూ.... రండిరా.... జరగాల్సింది సూడంణ్రా" అంది ఏడుస్తూనే.

జనం కదలలేదు చూస్తూ నిలబడ్డారు దూరంగా.

* * *

"వాణ్ణి అనవసరంగా చంపేరు. తప్పు చేసింది మన అమ్మాయి. అది ఒళ్ళు కొవ్వెక్కి– వాణ్ణి రెచ్చగొడితే.... మీరు శిక్ష వేసింది వాడికి" ధర్మరాజు భార్య-ధర్మరాజు భార్యలా మాట్లాడింది.

ధర్మరాజు శిలలా నిలబడ్డాడు.

"మన బాకీలు వసూలుచేసి, మనం ఇంత కావటానికి ఇరవై ఏళ్ళగా శ్రమించింది వాడు. వాణ్ణి ఇంత దారుణంగా."

"గట్టిగామాట్లాడకు ఇన్‌స్పెక్టర్ ఇంకా వెళ్ళలేదు."అతి నెమ్మదిగా అన్నాడుధర్మరాజుగారు.

"సార్! ఇన్‌స్పెక్టర్‌గారు పిలుస్తున్నారు" కానిస్టేబుల్ లోపలికొచ్చేడు.

* * *

ముత్యాలు ప్రాధేయపడుతోంది.... ఏడుస్తోంది మాట్లాడుతోంది.

"ఓరేయి! ఇది ఊరా! వల్లకాడా. ఒక్కడు ముందుకు రారేంటిరా? ఆడు మీ అందరి సంసారాలు కూలదోశాడు. నిజమే. ఆడి బతుకే కూలిపోయిందికదరా! ఆడు సేసిన ఘోరాలుకు ఆణ్ణి ఎవడో పొట్టనెట్టేసుకున్నాడు."

"ఈడి శవాన్ని తగలేయంణ్రా! ఆడేం సేసినా ఆడికోసం సేయలేదురా! ఆ ధర్మరాజు కోసం సేశాడు. ఆడు ఈడి బతుక్కు కట్టిన ఇలువ వందరా! ఆడి తప్పేం లేదురా, ఒరేయి. నచ్చినోడి మీద జాలి సూపంణ్రా!"

ముత్యాలు అడుస్తోంది.... ఆక్రోశిస్తోంది.

దూరంగా నిలబడిన శివాలమ్మ చూస్తోంది. జనం చూస్తున్నారు, బొమ్మల్లా నిలబడి చూస్తున్నారు.

ముత్యాలు ఏడుపు... స్వగతం.... మాటా- జరిగిపోతూనే వున్నాయి.

* * *

ఇన్‌స్పెక్టర్‌గారు అసహనంగా ధర్మరాజుగారికేసి చూశారు సోఫాలో కూర్చున్నా ఆయన ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నారు.

ఇనప్పెట్టెలో కథలు చెప్పుకుంటున్న కరెన్సీలకు కొన్నింటికి వియోగం వచ్చేసింది.

గాలి తగలని కాకిజేబులో ఇరుక్కున్న కరెన్సీ నిట్టూర్చింది.

* * *

తాళాలు తప్పెట్లతో ఏడుకట్ల సవారి లేచింది.

"మావో...." అంటూ గొంతు చిల్లుపడేలా అరుస్తోంది ముత్యాలు. ఆమెను ఓదారుస్తోంది శివాలమ్మ.

ముందు రోజు పేర్రాజుతో కలబడిన కుర్రాడు నిప్పుకుండ పట్టుకుని నడుస్తున్నాడు.

జనం.... పేట పేటంతా అనుసరిస్తున్నారు ఎర్రటి గులాబి పూలదండలో అంతిమ ప్రయాణం అవుతున్నాడు పేర్రాజు.

* * *

ఖరీదైన బంగళాలో అతి మెత్తటి సోఫాలో ధర్మరాజుగారు కూర్చున్నారు.

వారి ముందున్న డెకలామ్ టేబిల్‌మీద రెండు గోల్డ్‌స్పాట్ లున్నాయి.

చిరాగ్గా లేచి ఇన్‌స్పెక్టర్‌గారు చిరునవ్వుతో గోల్డ్‌స్పాట్ అందుకున్నాడు.

ధర్మరాజుగారు వజ్రాలు పొదిగిన ఉంగరాలున్న చేతితో మరో గోల్డ్‌స్పాట్ అందుకున్నారు. ఆ ఆరెంజ్ ద్రవాన్ని స్ట్రాతో పీల్చడానికి పూనుకున్నారు.

ద్రవం గొంతులోకి మెత్తగా దిగలేదు.

అసహనంగా స్ట్రాకేసి చూశారు.

స్ట్రాలో చిన్న చిల్లు. స్ట్రా విసిరికొట్టేరు.

* * *

పేర్రాజు భౌతికకాయం చితిమీద కాలుతోంది.

జనం కళ్ళనీళ్ళతో నిలబడి వున్నారు.

'పటేల్' మని కపాలమోక్షం జరిగిపోయింది.

* * *

దూరంగా నిలబడిన పోతురాజు ధర్మరాజుగారు స్ట్రా విసిరికొట్టడం చూశాడు. ముందుకు అడుగు వేశాడు పోతురాజు- 'మరో స్ట్రా' (అందించేడు).